క్లుప్తంగా

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి



మోపాల్(నిజామాబాద్ రూరల్): సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవు దినంగా ప్రకటించాలని మండల ఉపసర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ బాలు నాయక్ ఆదివారం విజ్ఞప్తి చేశారు. 15 కోట్ల గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ అని, బంజారాల సమాజాభివృద్ధికి, చైతన్యానికి గిరిజన బిడ్డలను భక్తిమార్గంలో నడిచేలా కృషి చేశారని తెలిపారు. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా మహారాజ్ జయంతిని నిర్వహించడం చాలా సంతోషకరమని, ఇందుకు సీఎం కేసీఆర్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మహారాజ్ జయంతి రోజైన ఫిబ్రవరి 15న ఉద్యోగులు, అన్ని పాఠశాలలకు సెలవు దినంగా ప్రకటించాలని బాలు నాయక్ విజ్ఞప్తి చేశారు.

శ్రీకృష్ణ బ్రహ్మోత్సవాలు



బాల్కొండ: మండల కేంద్రంలోని శ్రీ కృష్ణ మందిరంలో మూడు రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభించారు. మొదటి రోజు ధ్వజారోహణం, నవగ్రహ పూజ, అంకురార్పణ, పుణ్యావచనం, అభిషేకం, రాధాకృష్ణుల విగ్రహ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో యజ్ఞం చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో..



నవీపేట: మండల కేంద్రంలోని హనుమాన్ మందిరంలో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. దంపతుల సమక్షంలో హోమం, యజ్ఞం నిర్వహించారు. లోక కల్యాణానికి ప్రతి ఆదివారం ఒక మందిరంలో యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా సమాజ్ ప్రతినిధులు పేర్కొన్నారు.

నేడు శివాలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

అంటరానితనంపై పోరాడిన మహనీయుడు దయానంద



రుద్రూర్: అంటరానితనం, సతీసహగమనం, బాల్యవివాహాలు వంటి దురాచారాలపై పోరాడిన మహనీయుడు స్వామి దయానంద సరస్వతి అని వక్తలు పేర్కొన్నారు. స్వామి దయానంద సరస్వతి 200వ జయంతి పురస్కరించుకొని ఆదివారం రుద్రూర్ మండల కేంద్రంలోని గోశాలలో పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించారు. అనంతరం భారత దేశంలో స్వామీజీ చేసిన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త బచ్చురామ్ సేట్, పతంజలి యోగ సమితి సభ్యులు జ్యోతి, పుట్టి శ్రీను, నూత్పల్లి బాలరాజ్, సతీష్ గౌడ్, శివప్రసాద్, శంకర్, లలేందర్ పాల్గొన్నారు.

విహారయాత్రకు విద్యార్థులు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని లోటస్ పాఠశాల విద్యార్థులు విహారయాత్రకు వెళ్లారు. మాక్లూర్ మండలం మదనపల్లి సుభాష్ గార్డెన్‌ను ఈ సందర్భంగా సందర్శించారు. విద్యార్థులు సుభాష్ గార్డెన్‌లోని వాటర్ ఫాల్స్‌లో కేరింతలు కొడుతూ ఉల్లాసంగా గడిపారు. విద్యార్థులను ఆటవిడుపు కోసం విహారయాత్రకు తీసుకొచ్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అంబిక తెలిపారు.

‘డబుల్’ పంపిణీ ఎప్పుడు ?

- ఐదేళ్లకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి
- మొత్తం ఇళ్లు 100.. 274 మంది దరఖాస్తుదారులు
- ఎదురు చూస్తున్న ఆశావహులు



బాల్కొండ మండల కేంద్రంలో సిద్ధమైన డబుల్ బెడ్ రూం ఇళ్లు

బాల్కొండ: మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ ఎప్పుడా అని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు గత నెలలోనే ప్రారంభానికి సిద్ధమయ్యాయి. సంక్రాంతికి పంపిణీ చేయటానికి ముహూర్తం ఖరారు చేసినట్లు అధికారులు సైతం ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు ప్రారంభించలేదు.. పంపిణీ చేపట్టలేదు. 2017లో బాల్కొండ మండల కేంద్రంలో 100 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి పాలకులు శంకుస్థాపన చేశారు. కానీ పనులు అనుకున్నంత వేగంగా సాగలేదు. మధ్యలో రెండు సంవత్సరాలు కరోనాతో పనులు చేపట్టడానికి వీలు లేకుండా పోయింది. సీఎం కేసీఆర్ జనవరిలో డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆదేశించడంతో పనులు వేగవంతం చేశారు. కాని ఇప్పటికి పంపిణీ చేపట్టడం లేదు. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ పంపిణీలో జాప్యం జరగడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లకు రంగులు వేయడం కూడా పూర్తయింది. సీసీ డ్రెయినేజీలు, నీటి సరఫరా పైపు లైన్ పనులను పూర్తి చేశారు.

వంద మందికి అవకాశం

మండల కేంద్రంలో 100 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించారు. వాటి కోసం 274 మంది దరఖాస్తు చేసుకున్నారు. 100 మందిని ఎంపిక చేసి ఇళ్లు అందించటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఐదేళ్లకు అయినా సొంతింటి కల నెరవేరుతుందని ఆశావాహులు ఆశగా ఎదిరి చూస్తున్నారు. త్వరగా ప్రారంభించి పంపిణీ చేపట్టాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం..

మండల కేంద్రంలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఇళ్లను త్వరలోనే ప్రారంభిస్తాం. ముందుగా అనుకునట్లు జనవరి 15న పంపిణీ చేయాల్సి ఉంది. కానీ అనివార్య కారణాల వల్ల ఆగిపోయింది త్వరలోనే పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.
– రవీందర్‌రెడ్డి, డీఈఈ, ఆర్అండ్‌బీ

భూమిపూజ చేయకుండా విగ్రహావిష్కరణేంటి?

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న యెండల లక్ష్మీనారాయణ

ఎడపల్లి(బోధన్): బోధన్‌లో శివాజీ విగ్రహ ఆవిష్కరణ హడావిడిగా చేశారని, భూమి పూజ చేయకుండా, గద్దె నిర్మించకుండా ఆవిష్కరణ చేయడమేంటని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ చర్య వల్ల ఛత్రపతి శివాజీ అభిమానులకు, హిందూ బంధువులకు కోపం వస్తుందని అన్నారు. ఆదివారం ఎడపల్లిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యెండల మాట్లాడారు. బోధన్ నియోజకవర్గంలో పాలన గాడి తప్పిందని ఆరోపించారు. బోధన్ మండలం ఖండ్గాంలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు యువకుల హత్య కేసులను తారుమారు చేసి తప్పుదోవ పట్టించారని విమర్శించారు. ఈ ఘటనలో పోలీసు ఉన్నత అధికారులపై ఆరోపణలు వెల్లువెత్తినా ఎలాంటి చర్యలే లేవన్నారు. నియోజకవర్గంలో కబ్జాలు జరుగుతున్నా అధికార యంత్రాంగం చోద్యం చూస్తుందని పేర్కొన్నారు.

బియ్యం తరలింపులో భారీ కుంభకోణం

ఎమ్మెల్యేకు చెందిన నాలుగు రైస్‌మిల్లుల్లో బియ్యం తరలింపులో పెద్ద కుంభ కోణం జరిగిందని, తీవ్ర స్థాయిలో ఆధారాలతో పాటు ఆరోపణలు వెల్లువెత్తినా జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ విషయంపై తగు ఆధారాలతో భారత ఆహార సంస్థకు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. నిజాంసాగర్ ఆయకట్టు కింద ఉన్న ఎడపల్లి, బోధన్, రెంజల్ మండలాలకు చెందిన రైతులకు సాగునీరు అందడం లేదని, రైతులు రోడ్డెక్కి రాస్తారోకోలు, ధర్నాలు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి సాగునీటి అధికారులను బెదిరించి తన నియోజకవర్గానికి సాగునీటిని తీసుకుపోతున్నారని, దీనిని కట్టడి చేయాల్సి ఎమ్మెల్యే తన వ్యాపారాలకే పరిమితమై పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో మండల అధ్యక్షులు కమలాకర్ రెడ్డి, నాయకులు న్యావనంది గోపాల్ రెడ్డి, రామరాజు, సందీప్, రత్నాకర్, సంతోష్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఫ్యాక్టరీల మూసివేతతో కార్మికులకు అన్యాయం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్

బోధన్: జిల్లాలో వ్యవసాయాధార షుగర్ ఫ్యాక్టరీలను మూసి వేసి రైతులు, కార్మికులకు ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బోధన్ ఎన్డీఎస్ఎల్‌ను స్వాధీనం చేసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినా.. ఆచరణకు నోచుకోలేదని, లేఆఫ్ ప్రకటించి ఫ్యాక్టరీని మూసివేసి ఏడున్నరేళ్లు గడిచినా పునరుద్ధరించకుండా చోద్యం చూస్తోందని పేర్కొన్నారు. బకాయి వేతనాలు చెల్లించకుండా కార్మికులను తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తోందన్నారు. అలాగే సారంగపూర్ కో–ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ మూతపడి ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు షుగర్ ఫ్యాక్టరీల మూసివేతపై పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని రాకాసీపేట్‌లో నిర్వహించిన ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు ప్రభుత్వాస్పత్రుల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని చెబుతున్నారని, కానీ క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి లేదన్నారు. బోధన్ జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు సమయ పాలన పాటించకుండా, సకాలంలో అందుబాటులో ఉండకపోవడంతో కాన్పునకు వచ్చిన మహిళలు ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోందని ఆరోపించారు. నాయకులు యేశాల గంగాధర్, గంగాధర్, శ్రీనివాస్, సబ్బానీ లత పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



రైస్‌మిల్‌ను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి

రుద్రూర్: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ ఆగ్రో ఇండస్ట్రీ(రైస్ మిల్)ని ఆదివారం డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో ఇండస్ట్రీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నిరుద్యోగులకు అవకాశాలు కల్పించాలన్నారు. రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, రైతు బంధు మండల కనీవ్నర్ తోట సంగయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ సంజీవులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్ర పటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న దళిత సంఘాల నేతలు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో అంబేడ్కర్ భవనానికి స్థలాన్ని కేటాయించిన ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ చిత్రపటానికి దళిత సంఘాల నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం శక్కర్‌నగర్ కాలనీలోని ఎన్ఎస్ఎఫ్‌కు చెందిన కో–ఆపరేటివ్ స్థలాన్ని కేటాయించడం అభినందనీయం అన్నారు. ఈ స్థలాన్ని కేటాయించిన ఎమ్మెల్యేకు దళితుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దళిత నాయకులు రేకం దాసు, పెర్క స్వామి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నిన్నె కృష్ణ, యాదగిరి, సాగర్, స్వామి, సురేందర్, శివ, తదితరులున్నారు.

నలందలో కేసాట్ పరీక్ష



స్కూల్లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి నలంద హైస్కూల్‌లో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన ఈ–అభ్యాస్ ఐఐటీ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(కేసాట్) నిర్వహించారు. జగిత్యాల, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కేసాట్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు హైదరాబాద్ రవీంద్ర భారతిలో త్వరలో నిర్వహించే కార్యక్రమంలో ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలను అందజేయనున్నట్లు అకాడమీ తెలంగాణ జోనల్ ఇన్‌చార్జి మణికంఠ తెలిపారు. పరీక్షల వల్ల విద్యార్థులు మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులలో ప్రావీణ్యం సాధిస్తారని నలంద హైస్కూల్ కరస్పాండెంట్ ప్రసాద్ తెలిపారు.

జిల్లా ఉద్యమానికి శివ సంఘటన మద్దతు



దీక్షలో కూర్చున్న శివ సంఘటన నాయకులు

బోధన్: బోధన్ కేంద్రగా ప్రత్యేక జిల్లా సాధన కోసం న్యాయవాదులు చేపట్టిన ఉద్యమానికి శివ సంఘటన(వీరశైవ లింగాయత్) నాయకులు మద్దతు తెలిపారు. ప్రత్యేక జిల్లా సాధన కోసం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 56వ రోజుకు చేరాయి. దీక్షలో శివ సంఘటన జిల్లా, డివిజన్ ప్రతినిధులు శుభం పటేల్, సిద్దాపూర్ శివకుమార్, విలాస్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.గంగారెడ్డిలు కూర్చున్నారు. వామపక్ష పార్టీల నాయకులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి

బోధన్‌టౌన్(బోధన్): రాకాసీపేట్‌లోని మున్సిపల్ వాటర్ వర్క్స్‌లో గల సంకట విమోచన గణపతి ఆలయ ఐదవ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సతీమణి అయేషా హాజరై అన్నదానం చేశారు. వార్షికోత్సవంలో కౌన్సిలర్ పౌల్, మండల అధ్యక్షుడు సంజీవ్ కుమార్, నాయకులు తోకల గంగారెడ్డి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ



పరామర్శిస్తున్న దళిత సంఘాల నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి మాజీ సర్పంచ్ మెట్టు నరేశ్‌ను దళిత సంఘాల నాయకులు ఆదివారం పరామర్శించారు. ఇస్సాపల్లిలో భూమి ఆక్రమణను అడ్డుకున్న ఆయనను కొందరు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. దీంతో దళిత సంఘాల నాయకులు పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిని అధికారులు కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు బంగారు సాయిలు, విజయ్ కుమార్, మూగ ప్రభాకర్, కేశ్‌పల్లి రవి, పాంగ్ర శంకర్, అన్వర్ అలీ, షేక్ హుస్సేన్, తదితరులు ఉన్నారు.

ముదిరాజ్ సంఘం కార్యవర్గం ఎన్నిక



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పెద్దబజార్‌లో ఒకటవ తర్ప ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రుద్రవేణి అశోక్, ఉపాధ్యక్షుడిగా సాంబడి ప్రతాప్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముదిరాజ్ సంఘం అభివృద్ధికి కృషిచేస్తామని నూతన అధ్యక్షుడు అశోక్ అన్నారు. కార్యక్రమంలో మందుల బాలకిషన్, బొండ్ల మోహన్, జక్కం పోశెట్టి, బొండ్ల సంతోష్, గాజం మహేందర్, సాంబడి పోశెట్టి, ప్రవీణ్, రమేశ్, బొండ్ల ఆనంద్ పాల్గొన్నారు.

కేబీఏ నూతన కార్యవర్గం..



అహ్మద్ హుస్సేన్

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్(కేబీఏ) నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అహ్మద్ హుస్సేన్, ఉపాధ్యక్షుడిగా కొమ్ముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చిలివేరి పవన్ కుమార్, కోశాధికారిగా చిలివేరి గంగాప్రసాద్, సహాయ కార్యదర్శిగా ఘనపురం రవిలను ఎన్నుకున్నారు.

ఎలక్ట్రీషియన్స్ కార్యవర్గం..



బాల్కొండ: మండల ప్రయివేటు ఎలక్ట్రీషియన్ల నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ షకీల్, ఉపాధ్యక్షుడిగా భోజేందర్, ప్రధాన కార్యదర్శిగా జాపు సాయినాథ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షకీర్, కోశాధికారిగా అంబటి నవీన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిని సన్మానించారు.

యాసంగి పంటలకు భరోసా



సాలూర శివారులో పంప్ హౌస్ ద్వారా ప్రవహిస్తున్న మంజీర నీరు



మంజీర నది ఒడ్డున నిర్మించిన సాలూర ఎత్తిపోతల పథకం ప్రధాన పంప్ హౌస్ (ఫైల్)

- అండగా నిలుస్తున్న సాలూర ఎత్తిపోతల పథకం
- సమష్టి కృషితో మంజీర జలాలను వినియోగించుకుంటున్న రైతులు
- అవసరం మేరకు పంటల సాగుకు వినియోగం, అనంతరం చెరువుల్లో నిల్వ

బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండలం కేంద్రం శివారులోని మంజీర నది తీరంలో నిర్మించిన ఎత్తిపోతల పథకం అన్నదాతలకు అండగా నిలుస్తుంది. ఏళ్లుగా రైతులకు వానాకాలం, యాసంగి పంటలకు సాగు నీటిని అందిస్తున్న ఈ పథకం ఆ ప్రాంత రైతులకు వరంగా మారింది. సాలూర శివారులో ఉన్న రైతులు అందరూ సమష్టి కృషితో ఈ ఎత్తిపోతల పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ పండించే పంటలకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నారు. రైతు ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్న వైఎస్ రాజశేఖర రెడ్డి చొరవతో నిర్మించిన ఈ సాలూర ఎత్తిపోతల పథకం జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తుంది. 2009లో నిర్మాణం పూర్తి చేసుకుని ప్రతి ఏటా వానాకాలం, యాసంగి పంటలకు సాగు నీటి భరోసా కల్పిస్తున్న ఈ ఎత్తిపోతల పథకాన్ని రైతులు నిర్వహణ ఖర్చులు భరించుకుంటూ పంటలను పండించుకుంటున్నారు. ప్రస్తుత యాసంగిలో ఈ ఎత్తిపోతల పథకం ద్వారా అత్యధికంగా వరి, ఆరుతడి పంటలకు మంజీర నీళ్లను వాడుకుంటూ కాలువలతో గ్రామంలోని చెరువుల్లో సైతం నీటిను నిల్వ చేసుకుంటున్నారు.

వైఎస్ రాజశేఖర రెడ్డి చొరవతో...

గతంలో బోధన్ మండలంలో మేజర్ గ్రామ పంచాయతీగా ఉండి ప్రస్తుతం మండల కేంద్రంగా ఏర్పడిన సాలూరలో అత్యధిక కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారం పడి జీవనం సాగిస్తున్నాయి. సాలూర రైతులు పదేళ్ల క్రితం వరకు వర్షాల ఆధారంగా పంటలను సాగు చేసి ఎన్నో కష్టానష్టాలను ఓర్చుకున్నారు. పక్కనే మంజీరా నది పారుతున్నా సాగు నీటి కోసం ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని సాలూర అన్నదాతలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ఎత్తిపోతల పథకం కోసం అప్పట్లో రూ.3 కోట్ల నిధులు మంజూరు చేశారు. భూమిపూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. 2009లో పథకం పూర్తయి వినియోగంలోకి వచ్చింది. అప్పటి నుంచి ఏటా రెండు పంటలకు మంజీర నీళ్లను వినియోగించుకుంటూ సాగు నీటి కష్టాలు లేకుండా చూసుకుంటున్నారు. సాలూర శివారులో 16 వందల ఎకరాల వరకు ఎత్తిపోతల పథకం ద్వారా నీరందుతోంది. ఎత్తిపోతల ద్వారా మంజీరా నీటిను వినియోగించుకునే రైతులు ఎకరాకు రూ.800ల చొప్పున డబ్బులు చెల్లిస్తూ విజయవంతంగా ఎత్తిపోతల పథకం నిర్వహణ చేసుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆ నీటితోనే వరి పండిస్తున్నా



సాలూర శివారులో నాకు ఎకరన్నర పొలం ఉంది. మా పొలంలో బోరు లేదు. ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే నీటితోనే వానాకాలం, యాసంగిలో వరి సాగు చేస్తున్నాను. ప్రతి సీజన్‌లో ఎకరాకు రూ.800ల చొప్పున చెల్లిస్తాను. ఈ ఎత్తిపోతల పథకంతో పంటల సాగు భరోసాగా ఉంది. రైతులందరం కలిసి అవసరం కొద్ది మంజీర నీరు వాడుకుంటాం.
– గడ్డం. రాచప్ప, రైతు, సాలూర

చెరువుల్లోనూ నింపుకుంటున్నాం



మంజీన నది ఒడ్డున నిర్మించిన సాలూర ఎత్తిపోతల పథకం ఎన్నో ఏళ్లుగా వానాకాలం, యాసంగి పంటలకు పంటల సాగుకు సాగునీటి భరోసాను అందిస్తుంది. రైతులందరం సమన్వయంతో మంజీర నీటిని ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌లు, కాలువల ద్వారా పంటల కోసం వాడుకుంటున్నాం. చెరువుల్లో సైతం మంజీర నీటిను నిల్వ చేసుకుంటున్నాం.
– మైదపు నాగరాజు, రైతు, సాలూర

రోడ్లపైనే వాహనాల పార్కింగ్



పోచంపాడ్‌లో అప్రోచ్ రోడ్డుపై నిలిపిన వాహనాలు

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ వద్ద తెలంగాణ గురుకుల బాలుర పాఠశాల ఎదుట అప్రోచ్ రోడ్డుపై భారీగా వాహనాలు నిలుపడంతో రోడ్డు వెంబడి వెళ్తున్న ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రతి నెలా రెండవ ఆదివారం విద్యార్థులను వారి తల్లిదండ్రులతో కలవడానికి అవకాశం ఉంటుంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకువచ్చిన వాహనాలను నిలుపటానికి స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో అక్కడ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ప్రమాదాలూ జరిగే అవకాశం ఉంది. పాఠశాల ఆవరణలో స్థలం ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు అనుమతించక పోవడంతో రోడ్డుపైనే వాహనాలను నిలుపు కోవాల్సి వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగక ముందే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.